క్లుప్తంగా

మహిళపై దౌర్జన్యం

నెల్లూరు(క్రైమ్): వివాహితను ఆమె బంధువులు అడ్డగించి అసభ్య పదజాలంతో దూషించి దౌర్జన్యానికి పాల్పడిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన హసీనా, సందానీ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వీరి ఇంటి పక్కనే బంధువు ఖుర్షీదాబేగం నివాసం ఉంటున్నారు. ఆమె కుటుంబంలోనూ చిన్నపిల్లలున్నారు. పిల్లల విషయాల్లో ఇరు కుటుంబాల నడుమ మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి హసీనా ఇంటికెళ్తుండగా, ఖుర్షీదాబేగం, ఆమె భర్త గౌస్‌మొహిద్దీన్, కుమారుడు షబ్బీర్ అడ్డుకున్నారు. అసభ్య పదజాలంతో దూషించి ఆమెపై దౌర్జన్యం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ - క్రాప్‌తో ప్రభుత్వ రాయితీలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): ఈ-క్రాప్ నమోదుతో రైతులకు ప్రభుత్వ రాయితీలు, పథకాలు లభిస్తాయని కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. విడవలూరు మండలంలోని పార్లపల్లి, విడవలూరు, ఊటుకూరు గ్రామాల్లో సోమవారం కలెక్టర్ పర్యటించి ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులతో నేరుగా మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఈ-క్రాప్‌లో జరిగిన అవకతవకల కారణంగా ఈసారి ఈ-క్రాప్ నమోదును పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల్లో విడవలూరు మండలం నుంచి దాదాపు 23 మంది రైతులను విచారించాలని ఆదేశాలందాయన్నారు. వీరు నిజమైన రైతులా, వీరు పండిస్తున్న పంట వివరాలు, ఎన్ని హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారో పూర్తి వివరాలను సేకరించినట్లు తెలిపారు. మండలంలో ఇప్పటివరకు దాదాపు 80 శాతం మాత్రమే ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని, మిగిలిన 20 శాతం మంది రైతులు కూడా త్వరగా ఈ-క్రాప్‌లో వారి పూర్తి వివరాలతోపాటు పంట వివరాలు కూడా నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే ఈకేవైసీ కూడా తప్పనిసరి అన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు మాత్రమే రైతుభరోసా, పంట రుణాలు, పంటనష్టం బీమా వర్తిస్తాయని, ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ-క్రాప్‌లో నమోదు కాకపోతే ప్రభుత్వ రాయితీలకు రైతులు దూరమవుతారన్నారు. ఈ-క్రాప్ నమోదు విషయంతో వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట డీఏఓ సుధాకర్‌రాజు, కోవూరు ఏడీఏ సుజాత, ఏఓ వెంకటకృష్ణయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

దిశ యాప్‌ను వినియోగించుకోండి

ముత్తుకూరు: యువతులు, బాలికలకు కష్టం వస్తే దిశ యాప్‌ను వినియోగించుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ సూచించారు. ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జరిగిన 'బేటీ బచావో – బేటీ పడావో' అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు తమను తాము రక్షించుకొనే స్థాయికి ఎదగాలని సూచించారు. మంచి-చెడు స్పర్శల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు చెప్పారు. ప్రస్తుత జనాభాలో అబ్బాయిలు, అమ్మాయిల నిష్పత్తి 1000 : 931గా ఉందని, ఈ దశలో అమ్మాయిలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. దిశ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, ఐసీడీఎస్ సిబ్బంది వీవీ రత్నం, సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గంజాయి అనుమానితుల బైండోవర్

కొడవలూరు: మండలంలోని ఇద్దరు గంజాయి అనుమానిత మహిళలను కోవూరు ఎస్‌ఈబీ అధికారులు కొడవలూరు తహసీల్దార్ రమాదేవి ఎదుట సోమవారం బైండోవర్ చేశారు. కొడవలూరుకు చెందిన చప్పిడి మంగమ్మ, తలమంచికి చెందిన నాగులూరు తిరుపతమ్మలను రూ.2 లక్షల పూచీకత్తు, ఏడాదిపాటు బైండోవర్ అమలులో ఉండేలా తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. గతంలో వీరి వద్ద గంజాయి ఉన్నట్లు ఎస్‌ఈబీ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తగా బైండోవర్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయి, నాటుసారా, ఇతర రాష్ట్రాల మద్యం కలిగి ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14500కు లేదా ఎస్‌ఈబీ ఎస్సై 9440902524 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ ఎస్సైలు టి.శ్రీనివాసరావు, డి.శ్రీధర్, కానిస్టేబుల్స్ మస్తానయ్య, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

బుచ్చిరెడ్డిపాళెం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుచ్చిరెడ్డిపాళెంలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే జోన్లను సోమవారం మోటార్ వెహికల్ అధికారులు, పోలీసులతో కలిసి ఆయన గుర్తించారు.

ఆదాలకు ఘన స్వాగతం


కిరీటంతో సన్మానం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులై మొదటిసారిగా నగరానికి వచ్చిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. నగరంలోని వీఆర్సీ గ్రౌండ్స్ నుంచి అయ్యప్ప గుడి సెంటర్ వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలికామని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తాము క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలను తెలియజేశారు. కార్పొరేటర్లు రాజశేఖర్, ఇంతియాజ్, నాగరాజు, పార్టీ నేత వెంకటేశ్వర్లు, మైనార్టీ నేతలు హాజీ, మున్వర్, తదితరులు పాల్గొన్నారు.


భారీ గజమాలతో సత్కారం



ఆదాల ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు


రూప్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

అన్ని విధాలా ఆదుకుంటాం

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన తోటపల్లిగూడూరు కానిస్టేబుల్ సుధాకర్ కుమారుడు రిషి, చిల్లకూరు కానిస్టేబుల్ రమణ చెల్లెలు మల్లీశ్వరి, డీసీఓ స్వీపర్ హసీనా కుమారుడు అహ్మద్‌కు రూ.50 వేల చొప్పున చెక్కులను తన చాంబర్‌లో ఎస్పీ సోమవారం అందజేశారు. అనంతరం వారి కుటుంబ యోగక్షేమాలను ఆరాతీశారు. ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు త్వరితగతిన వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఏఎస్పీ హిమవతి, పోలీస్ కార్యాలయ ఏఓ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న విజయారావు

'స్పందన'తో సమస్యలకు పరిష్కారం

నెల్లూరు సిటీ: స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నామని కమిషనర్ హరిత పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా 13 సమస్యలు, స్పందన ద్వారా 22 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్పందనలో వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని చెప్పారు.


అర్జీలను స్వీకరిస్తున్న హరిత

క్రైమ్ కార్నర్

రాజీ చేసుకుందామని పిలిచి హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): కేసును రాజీ చేసుకుందామని స్నేహితుడ్ని పిలిచి కొందరు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెంలోని గాంధీనగర్‌కు చెందిన రేవంత్‌కు నగరంలోని పడారుపల్లి, సుందరయ్యకాలనీకి చెందిన గిరి, నాగరాజు స్నేహితులు. గతంలో వీరిపై సంగం పోలీస్‌స్టేషన్లో డెకాయిటీ కేసు ఉంది. అప్పట్లో పోలీసులు వీరిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అనంతరం బెయిల్‌పై బయటకొచ్చారు. డబ్బులు తీసుకొని నెల్లూరొస్తే కేసును రాజీ చేయించుకుందామంటూ రేవంత్‌కు గిరి, నాగరాజు ఫోన్ చేసి చెప్పారు. దీంతో రేవంత్ తన బైక్‌ను కుదువపెట్టి డబ్బులు తీసుకొని నగరానికి వచ్చారు. బాగా పొద్దుపోయే వరకు నగరంలోని ఓ హోటల్లో రేవంత్, గిరి, నాగరాజు, మరో స్నేహితుడు సాయి పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో ఉన్న రేవంత్‌ను వారు పడారుపల్లిలోని నీళ్ల ట్యాంక్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ముగ్గురూ కలిసి అతనిపై విచక్షణరహితంగా దాడి చేశారు. బీర్ బాటిల్‌తో గిరి పొడవబోగా రేవంత్ చేయి అడ్డం పెట్టడంతో మణికట్టుకు తీవ్రగాయమైంది. రేవంత్ కదలకుండా సాయి, నాగరాజు పట్టుకున్నారు. నీ వల్లే జైలుకెళ్లాం.. నువ్వు బతకకూడదంటూ చంపేందుకు గిరి యత్నించగా బాధితుడు పెద్దగా కేకలేశారు. దీంతో అటుగా వెళ్తున్న వారు, చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించిన నిందితులు పరారయ్యారు. అనంతరం బాధితుడు డయల్ 112కు ఫోన్ చేశారు. రాత్రి విధుల్లో ఉన్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ నరసింహారావు తన సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసును నమోదు చేశారు. గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. కాగా ప్రధాన నిందితుడైన గిరిపై హత్య కేసు ఉంది.

యువకులపై దాడి

నెల్లూరు(క్రైమ్): యువకులపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటన రామ్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌నగర్ పరిధిలోని రైల్వేట్రాక్ సమీపంలో నివాసం ఉంటున్న అబ్దుల్, అతని స్నేహితులు వెంకటసుబ్బయ్య, కరణజానీ, రవికుమార్ ఎంజీబీ మాల్లోని కార్ వాష్‌లో పనిచేస్తున్నారు. పనులు ముగించుకొని వీరు బయల్దేరారు. సాయిబాబా మందిర సమీపంలోకి వచ్చేసరికి మద్యం మత్తులో ఉన్న అదే ప్రాంతానికి చెందిన కల్యాణ్, సంతోష్, చంటి, మరికొందరు వారిని అడ్డుకొని ఇటుగా వెళ్లడానికి లేదంటూ ఘర్షణకు దిగారు. అనంతరం అక్కడే ఉన్న రాడ్లు, కేబుల్ వైర్లు, రాళ్లతో వారిపై దాడి చేశారు. దీంతో బాధితులు పెద్దగా కేకలేయడంతో స్థానికులు రావడాన్ని గమనించిన దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన అబ్దుల్, వెంకటసుబ్బయ్యను మిగిలిన స్నేహితులు హుటాహుటిన చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట ఎస్సై సుబ్రహ్మణ్యం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును సోమవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురానికి చెందిన రారాజు గతంలో హోమియో హాస్పిటల్లో పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నారు. ఆయన తల్లి వెంకటేశ్వరపురం బ్రిడ్జి వద్ద బంకును నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఉన్న సుధీర్, సల్మాన్‌తో రారాజుకు విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో తన తల్లిని చూసేందుకు బంకు వద్దకు ఆదివారం వెళ్లగా, సుధీర్, సల్మాన్, మరికొందరు అతనిపై దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

• వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన వెంకటేశ్వరపురంలోని విజయ డెయిరీ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. విజయ డెయిరీ సమీపంలో శ్రీనివాసులు కుటుంబం నివాసం ఉంటోంది. వెంకటేశ్వరపురానికి చెందిన రారాజు, అతని ఇద్దరు భార్యలు అకారణంగా శ్రీనివాసులుతో గొడవపడి కర్రతో దాడి చేశారు. దీంతో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యంతో వృద్ధుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నవాబుపేట మహాలక్ష్మమ్మ ఆలయ సమీపంలో కృష్ణసింగ్ (63) కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు కుమారుడు సురేష్, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వీట్స్ షాపులో వంటమాస్టర్‌గా పనిచేస్తున్న కృష్ణసింగ్ కొంతకాలంగా ఆస్మాతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం ఆయన్ను హాస్పిటల్‌కు కుమారుడు ఆదివారం తీసుకెళ్లారు. ఈ క్రమంలో పని ఉందంటూ ఇంటి నుంచి సోమవారం మధ్యాహ్నం బయటకొచ్చారు. వెంకటేశ్వరపురం ఫ్లయ్‌ఓవర్ సమీపంలో గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి జేబులోని సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

నెల్లూరు(టౌన్): కష్టపడేతత్వాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆర్‌ఐఓ వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని వీపీఆర్ కల్యాణ మండపంలో వర్ధన్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వార్షికోత్సవ సంబరాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. డీవీఈఓ మధుబాబు, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసులురెడ్డి, వీరాంజనేయరెడ్డి, వర్ధన్ విద్యాసంస్థల అధినేత చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు సాయిహార్దిక్‌రెడ్డి, వర్ధన్‌రెడ్డి, మోటివేటర్ నరసింహారెడ్డి, డీన్లు సత్యశ్యామ్, వెంగళరావు పాల్గొన్నారు.

ఘన సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతి పొందిన మురళి బాధ్యతలను సోమవారం స్వీకరించారు. దీంతో ఆయన్ను వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు సత్కరించారు. యూనియన్ రీజినల్ సెక్రటరీ శివయ్య, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సంజీవమూర్తి, సీనియర్ అసిస్టెంట్లు మధు, రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్లు కార్తీక్, రమేష్, ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



నెల్లూరు(బృందావనం): నిరాదరణకు గురైన బాలబాలికలకు పౌష్టికాహార కిట్లను షెల్టర్ ట్రస్ట్, అల్ఫా మెరైన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ సాల్మన్ మాట్లాడారు. దాదాపు వంద మందికి వీటిని అందజేశామని వివరించారు. అల్ఫా మెరైన్ నిర్వాహకులు శ్రుతి, మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి

నెల్లూరు(లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్యం (65) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమామహేశ్వరరెడ్డి, శ్రీధర్ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎల్ఐసీ పెట్టుబడులను అదానీ గ్రూపునకు మళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో కాంగ్రెస్ నేతలు ధర్నాను సోమవారం చేపట్టారు. బృందావనంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పీసీసీ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, నేతలు శేషారెడ్డి, పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు అనిల్, సురేష్‌బాబు, వెంకట్రావ్, ఫయాజ్, అల్లావుద్దీన్, లతారెడ్డి, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో పండ్లను రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్మిక శాఖ విశ్రాంత ఉప కమిషనర్ రఘు, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ఆశ్రమ నిర్వాహకుడు పాండు, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ పుస్తక ప్రదర్శన ప్రారంభం

నెల్లూరు(బృందావనం): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలోని ఎల్ఈఎఫ్ చర్చిలో క్రైస్తవ పుస్తక ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ కాపరి సువర్ణరావు మాట్లాడారు. ఈ నెల 12 వరకు రోజూ ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. పాస్టర్లు రెవరెండ్ ప్రభుదాస్, డేవిడ్ దయాసాగర్, వర్గిల్‌కుమార్, ఇమ్మానుయెల్, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(అర్బన్): తమ సమస్యలను పరిష్కరించాలని పలువురు విన్నవించారు. ఈ మేరకు కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి హాజరై కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాలను సమర్పించారు.

• చేనేత ఉపవృత్తులకు సైతం నేతన్న నేస్తం పథకాన్ని వర్తింపజేయాలని బీజేపీ నేత మిడతల రమేష్ కోరారు. ఉపవృత్తుల వారితో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో చేనేత పనులపై ఆధారపడి పది వేల కుటుంబాలు జీవిస్తున్నాయని చెప్పారు. అయితే మగ్గంగుంట ఉన్న 3800 కుటుంబాలకే నేతన్న నేస్తం పథకాన్ని వర్తింపజేశారని చెప్పారు. మిగిలిన వారికి సైతం అందజేయాలని కోరారు. నేతలు సుబ్రహ్మణ్యం, రఘురామయ్య, చంద్ర, రాంబాబు, రామకృష్ణ, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

• తన చిన్న కుమార్తె గౌసున్నీసా మాయమాటలు చెప్పి ఆస్తిని రాయించుకొని తనను తరిమేశారని.. ఆదుకోవాలని అనంతసాగరానికి చెందిన మస్తాన్‌బీ కోరారు. కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని మైనార్టీ నేత మొయినుద్దీన్ ఆధ్వర్యంలో అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆస్తితో పాటు 8 సవర్ల బంగారు, రూ.రెండు లక్షలను తీసుకొని తనను వీధిన పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు.

• విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఏడు తరగతులకు ఒకే ఉపాధ్యాయురాలు ఉన్నారని, పాఠశాలకు మరో ముగ్గురు టీచర్లను నియమించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎంపీటీసీ, సర్పంచ్ గోవర్ధన్, మోహన్, విశ్రాంత ఉపాధ్యాయుడు అంకయ్య ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న రమేష్, తదితరులు

కలెక్టరేట్ ఎదుట ధర్నాలు

నెల్లూరు(అర్బన్): సమస్యలను పరిష్కరించాలంటూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నాలను సోమవారం చేపట్టారు. అనంతరం కలెక్టర్ చక్రధర్‌బాబుకు వినతిపత్రాలను సమర్పించారు.

• జిల్లాలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనంగా రూ.26 వేలను ఇవ్వాలని కోరుతూ ట్రంక్‌రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనను అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద బైఠాయించారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ, జిల్లా నేతలు సుజాతమ్మ, రెహానా బేగం, మస్తాన్‌బీ, రమమ్మ, తదితరులు పాల్గొన్నారు.

• లైంగిక, యాసిడ్ దాడికి గురై చికిత్స పొందుతూ మృతి చెందిన బుజబుజనెల్లూరులోని నక్కలకాలనీకి చెందిన మేఘన కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు దాడికి కారణమైన నాగరాజును ఉరితీయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నాను ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టారు. ఐద్వా జిల్లా నేతలు రమమ్మ, షంషాద్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

• జగనన్న ఇళ్ల నిర్మాణాలకు గానూ ఒక్కో ఇంటికి కనీసం రూ.ఐదు లక్షలను విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నాను సీపీఐ నేతలు, కార్యకర్తలు చేపట్టారు. పార్టీ జిల్లా కార్యదర్శి అంకయ్య, వ్యవసాయ సంఘ కార్యదర్శి శేఖర్, నేతలు సిరాజ్, రమణయ్య, షానవాజ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా యువజన, సంగీత నృత్యోత్సవాలు

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ సమీపంలోని ఎస్పీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో యువజన, సంగీత నృత్యోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, పర్యాటక శాఖ అధికారి దుర్గాభవానీ హాజరయ్యారు. సంగీత విద్వాంసులు సుధాకర్, మహేష్ నాదస్వర కచేరిని నిర్వహించారు. మల్లికార్జున్, ప్రశాంత్ డోలు సహకారం అందించారు. అనంతరం విజయ్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీకి చెందిన విద్యార్థుల నృత్య ప్రదర్శన అలరించింది. ప్రిన్సిపల్ సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

